26052025-MAI-04_Layout 1 5/26/2025 3:20 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

## ఏమైపాయె నా జీవనది! ఎందుకిట్లాయె!!

సబ్బండ శ్రమ శక్తి ఆయుధమ్మయి తిరుగబడు ఈ నేల పూరించు వేన వేల ధిక్కార ధ్వనులు పూయించు త్యాగాల పూలు విరజిమ్ము ఈ నేల.. అమరుడేమాయెరా – అతని ఆశయమ్మేమయిపాయె – కనుకొలుకులలో రాలిపడు అగ్ని తప్త అశ్రు జలధారల మహోజ్వల పోరుకెరటాలేమైపాయె.. నాగడ్డ బొందల గడ్డయిపాయే, పేగు తెంచుకు త్యాగాన్ని ముద్దాడిన బిడ్డ కల తడియారకనేపాయే! ఏమైపాయె నా జీవనది.. ఎందుకిట్లాయె!!

> పోరాట ధ్వనిలోన ఎగిరెగిరి దుంకిన గజ్జెలేమైపాయె, గంభీర కంఠస్వర కుత్తుకలన్ని నేలరాలిపోయెనా – మొలలు తెగనరుకుకొని మూలకు కూసునెనా, పదియారు పట్నాలు పదినూర్ల గ్రామాలు ఒక్క పెట్టున చిచ్చులేపిన చిర్రె చిటికెలేమయిపాయె! భేరీలు రణభేరీలు రౌద్రమ్ములొలికించి సాగించినా సమరమ్మేమయిపాయె. ఏమైపాయె నా జీవనది.. ఎందుకిట్లాయె!

పరిసెరాముండ్ల జెట్టలన్నీ పుట్టి చేతులిరిగిపాయెనా, కళలకు పక్షవాతమ్ములొచ్చేనా పాండురోగమ్ములొచ్చేనా, దాశరథి కాళోజీ నాయాత్మయని పలికిన కూటమ్ములేమాయె– నివ్వెర పోయెనా నిర్ఘాంతపోయెనా ఆకాశమ్ములే తెగిపడిన ఒడిసిన సిరాపాళీల రక్తమ్ము నింపి రచనా రహదారుల సాగింతు కవ్వింపు కాదిది కదనమ్మని భీషణ భాషణల్జేసిన కూపస్థ మండూకాలేమైపాయె– శిలనాభిలో చిక్కుకుపాయెనా – రాకాసుడపహరించెనా బాలనాగమ్మ బందీయైన తీర... ఏమైపాయె.. నా జీవనది ఎందుకిట్లాయె!!

విశ్వనాథుల పుష్పగిరి

# గుండెల్లో గూడు కట్టుకునే కథలు

**బుకర్ ప్రైజ్ విజేతగా బాను ముష్తాక్ ఎంపికయ్యారు. ఆమె రచించిన 'హార్ట్ ల్యాంప్', పుస్తకాన్ని ఇంగ్లీష్‌లోకి 'దీపా భాస్తి' అనువదించారు. 2025అంతర్జాతీయ కన్నడ కథల సంకలన రచయితగా బాను ముష్తాక్ నిలవడం అభినందనీయం. ఆ సందర్భంగానే ఈ వ్యాసం...**

1948లో ముస్లిం కుటుంబంలో జన్మించిన బాను ముష్తాక్ 1970లో రచనా జీవితాన్ని ప్రారంభించారు. దళితులు, ముస్లింల స్వరాలు సాహిత్యంలోకి వచ్చిన కాలంలో, బండాయ (తిరుగుబాటు) సాహిత్య ఉద్యమంలో ఆమె వనితా స్వరంగా నిలిచారు. ఆమె కథలు జాతి, వర్గ, లింగ వ్యవస్థలపై ప్రశ్నల వర్షం కురిపిస్తాయి. బానుకు చిన్నతనం నుంచే చదువుపై, సమాజంలోని అన్యాయాలపై ఆసక్తి ఉండేది. ముస్లిం మహిళగా ఎదగడం, తన చుట్టూ ఉన్న లైంగిక, సామాజిక వివక్షను గమనించడం ఆమెలో రాజకీయ స్పష్టతను పెంచింది. న్యాయవాదిగా సేవలందించిన బాను ముష్తాక్, ఎంతోమంది సామాన్యుల తరపున న్యాయపోరాటం చేశారు. అది ఆమె కథల్లోనూ ప్రతిఫలించింది. ఆమె రచనల్లోని పాత్రలు తరచుగా చట్టం, న్యాయం, సామాజిక ఒత్తిళ్ల మధ్య జీవించినవే. ఇప్పటికే ఆమె ఆరు కథా సంపుటాలు, ఒక నవల, వ్యాస సంపుటి, కవితా సంకలనం వెలువరించారు. ఆమెకు కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు, దానా చింతామణి అట్టిమబ్బే అవార్డు వంటి గౌరవాలు లభించాయి.

'హార్ట్ లాంప్' అనేది 1990 నుంచి రాసిన 50కి పైగా కథలలోంచి ఎంపికైన అత్యుత్తమ 12 కథల సమాహారం. బాను రచనలు మొదట 1990లో వెలుగులోకి వచ్చాయి. ఆమె మొదటి కథే మహిళా మానసిక స్థితిని గుండెను కలచివేసేలా ఆవిష్కరించింది. ఆమె రచనల్లో స్త్రీల అంతర్మథన పోరాటాలు, మత రాజకీయాలు, పట్టణ గ్రామీణ జీవితాల నడుమ కనిపించే విభజనలు, సామాజిక న్యాయం, విద్య, స్వేచ్ఛ కోసం పోరాటం ప్రధాన అంశాలు గా ఉంటాయి. ఆమె కథల్లో ఉన్న భావోద్వేగాలు లోతుగా ఉన్నా, భాష అతి సాధారణంగా ఉంటుంది.

వారాల ఆనంద్
94405 01281

'హార్ట్ లాంప్' పన్నెండు కథల సంకలనమే కాదు, అదొక రచయిత జీవిత ప్రయాణం. ప్రతి కథలో వ్యక్తుల మధ్య సంబంధాలు, పరిసరాలు, నిశ్శబ్దంగా ఉండే వేదనలు, జీవితపు సందిగ్ధతలు ప్రధానంగా కనిపిస్తాయి. దీపా భాస్తి ఇంగ్లీష్ అను వాదం గొప్పగా ఉంది. 'అనువాద రచన ఒక కళ' అని ఈ పుస్తకం నిరూపించింది. ఇంటర్నేష నల్ బుకర్ బహుమతి సాధనతో బాను ముష్తాక్ తనకు మాత్రమే గౌరవం తెచ్చుకోలేదు, కన్నడ భాషకు, భారతీయ ప్రాంతీయ భాషల సాహి త్యానికి విశ్వస్థాయిలో గుర్తింపు తెచ్చారు.

> నిజాని కి బాను జీవితం సాధారణంగా ప్రారంభమైంది. వైద్య విద్యను చదివి మంచి డాక్టర్ కావాలని ఆమె భావించారు. కానీ, చదువుతో పాటు ఆమె హృదయంలో ఇంకొక తలంపు మెదిలింది. కథలు రాయాలని, మనుషుల అనుభవాలను తన మాటల్లో చిత్రీకరించాలనే ఆలోచన మొదలైంది. ఈ లోపలి పిలుపు ఆమెను వైద్య విద్యను వదిలి రచనా ప్రపంచంలోకి తీసుకువెళ్లింది. ఆ నిర్ణయం ఇప్పుడు చరిత్ర సృష్టించిన నేపథ్యంగా నిలిచింది.

బహుమతిని అందుకున్న అనంతరం బాను ముష్తాక్ మాట్లాడుతూ... 'ఈ గొప్ప రచయితల మధ్య నిలబడి ఉండటమే గౌరవం. మనం భిన్నతను ఆమోదించేటప్పుడు, ఒకరినొకరం పొగిడేటప్పుడు ఆ యూనిటీ కలిసికట్టుగా జీవించే మార్గాన్ని సూచిస్తుంది. ప్రతి కథకు ఓ వెలుగు ఉంది. దీని విజయం ఇంకా ఎన్నో మూలాల్లో దాగిన గళాలకు వెలుగుదారి' కావాలి అన్నారు. అలాగే, కన్నడ భాష గురించి మాట్లాడుతూ... 'కన్నడ అనేది ప్రతిఘటనను, లోతైన భావనను పాడే భాష. ఇందులో రాయడ మనేది విశ్వాసమూ, ఆత్మీయతల కలయిక' అని చెప్పారు. ప్రతి కథ చిన్నదే అనుకునేవారికి ఇది సమాధానం. ఏ కథా చిన్నది కాదు. భవిష్యత్తుకు మార్గం చూపే 'దీపం'. ఈ కథలు దక్షిణ భారతదేశంలో ముస్లిం సముదాయాల్లోని మహిళలు, బాలికల జీవితాలపై ఆధారపడి రాశారు. ఇందులో లింగవివక్ష, కులవ్యవస్థ, మతపరమైన ఒత్తిడులు, శక్తి సంబంధాలు వంటి అంశాలు కీలకంగా ఉన్నాయి. ఆమె జీవితం తీరుగా సాగిన కథల శైలీ, అంతర్జాతీయంగా అందుకున్న గౌరవం ఇవన్నీ కలిపి ఆమెను ఈ తరం గొప్ప కథా రచయితల్లో ఒకరిగా నిలిపాయి. ఇవి ముప్పై ఏండ్లుగా మహిళల హక్కుల కోసం పోరాడిన రచయిత్రి రాసిన కథలు, అనుభూతితో, చాతుర్యంతో అనువదించబడి పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం. ఈ పుస్తకం మన కాలానికి, గొంతు లేని వ్యక్తుల అనుభవాలకు ప్రతినిధిగా నిలుస్తుంది. 'నా రచనా శైలి అనేది ప్రజలతో ముఖాముఖి సంభాషణలా ఉంటుంది. అది వారి పక్కనే బల్లపై కూర్చొని, కుటుంబ జీవిత ఆనందాలు, బాధలు, ప్రపంచంలో జరుగుతున్న విషయాలను మనస్ఫూర్తిగా చర్చించడం లాంటిది.' అన్నారు బాను ఒకచోట.

> 'రచన అనేది కేవలం కలంతో చేసే పనికాదు. అది, హృదయంతో చేసే ప్రయత్నం'
> – బాను ముష్తాక్

బహుమతిని ప్రకటించినప్పుడు, జడ్జింగ్ ప్యానెల్ ఇలా అన్నది... 'బాను ముష్తాక్ కథలు ప్రాంతీయమైనవే అయినా, అవి చెప్పే భావనలు సార్వత్రికమైనవి. ఆమె కథలు మనిషి మనసును ఎంతగా అర్థం చేసుకోవచ్చో చూపిస్తాయి. బాను ముష్తాక్ విజయంతో కన్నడ సాహిత్యానికి గౌరవం పెరిగింది. అంతేగాక, ఇది భారతీయ ప్రాంతీయ భాషల రచయితలకు ఒక స్ఫూర్తిగా మారింది. వారి రచనలు, అనువాదాల ద్వారా ప్రపంచ వేదికలపై నిలవవచ్చన్న నమ్మకాన్నిచ్చింది. హృదయ దీప ('హార్ట్ లాంప్') రచయిత్రికి మనసారా అభినందనలు.

## ప్రియుని కోరిక
(గజల్-త్రిశ్ర గతి)

చెలి తలపులు తలనుతట్ట
చెంతచేర కోర్కెకలిగె
గుండెలోన గుబులుపుట్ట
ఇల్లుచేర కోర్కె కలిగె

చెలి పలుకులు గుర్తుకొచ్చి
తియ్యదనము రుచినిచూప
చిరునవ్వులు కనమనసయి
బయలుదేర కోర్కె కలిగె

చెలి చేష్టలు మదినిముట్ట
సంతసంబు సంగ్రహించ
మూటముల్లె సద్దుకోని
ఊరుచేర కోర్కె కలిగె

చెలి రూపము భ్రమ
కొలుపగ తక్షణమే చూడాలని
హృదిమురియ హుటాహుటిన
సఖినిచేర కోర్కెకలిగె

చెలిసరసం జ్ఞప్తికొచ్చి
శీఘ్రంగా పయనమవ్వ
బండినెక్కి దూసుకెళ్లి చెలిని
చేర కోర్కెకలిగె

చెలి మోమును తలచుకొనగ
ఎగిరిపోయి వీక్షిస్తూ
సమయాన్ని గడపాలని
సకియచేర మనసుకలిగె

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

> తెలంగాణ భాష అంటే మాట్లాడే పదాల సమాహారం కాదు. అదో జీవితం, అదో ఉనికి, అదొక జాతి గర్వబోతు గొంతుస్వరం. కానీ, ఈ గొంతు శతాబ్దాలుగా నొక్కబడింది. తెలంగాణ భాషను హేళన చేసిన కుట్రలు బ్రిటిష్ పాలన నుంచి, నిజాం నవాబుల కాలం దాకా, ఆ తర్వాత ఆంధ్ర పాలకుల చేతిలోనూ కొనసాగింది. ఈ భాషను 'వికృతమైనది', 'తౌరక్యాంధ్రం', 'అర టమాటలు' అంటూ చిన్నచూపు చూశారు. కానీ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం తిరగబడి చేసిన ఉద్యమమే ఈ భాషకు తిరిగి గౌరవాన్ని తీసుకువచ్చింది.

# తెలంగాణ భాషకు పట్టాభిషేకం

**భాషపై దాడుల చరిత్ర:** 18వ శతాబ్దం నాటి బహమనీ, నిజాం నవాబుల పాలనలో అధికారిక భాషలుగా దక్కనీ ఉర్దూ, అరబ్, పారసీ భాషలు బలవంతంగా ప్రవేశపెట్టబడినాయి. దాంతో తెలుగు పరిపాలనలోకి ప్రవేశించలేక ప్రజల భాష తెలంగాణ మూలన పడిపోయింది. ఆ తర్వాత అధికారులుగా ఆంధ్రా ముల్కీలు రావడం, 1956లో ఏకీకృత ఏపీ ఏర్పాటుతో తెలంగాణ భాష మళ్లీఅధికారం కోల్పోయింది. తెలంగాణ మాట మాట్లాడితే చదువుల్లో వెక్కిరింపు, ఉద్యోగాల్లో వెనుకంజ అనే దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వ పాఠశాలల నుంచి స్కాలర్‌షిప్ ఇంటర్వ్యూల వరకూ నీ మాటలతో నీ స్థాయి తెలుస్తోందనే అప్రతిష్ట మాటలు చెవుల్లో మోగాయి.

**పోరాట భాష ఉద్యమ శబ్దం:** తెలంగాణ భాష ఉద్యమ భాషగా మారింది. ఆ ఉద్యమానికి జ్ఞానబీజాలు నాటినవారు కవులు, రచయితలు, కళాకారులు. పోతన తన భాగవతాన్ని 'తెలుగు మాట చక్కగా రాస్తా'నని ప్రకటించగా, దాశరథి కృష్ణమాచార్యులు 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటూ తెలంగాణ గర్వాన్ని ఆలపించారు. నందిని సిధారెడ్డి తెలంగాణ భాషపై 'నన్ను కన్న తల్లి కన్న కంట చూసినవాణ్ణి' అంటూ ఈ భాషకు రక్తాన్ని చిందించారు. రచయితల్లో పరశురాం, రజినీ, రాపాక వర్మ, బత్తిని సత్యనారాయణ, వారాల ఆనంద్, కల్లూరి భాస్కర్, అల్లాదురై సుందర్, సీదిరి శేఖర్ లాంటి వారు తెలంగాణ భాషలో కథలు, నవలలు రచించి ప్రజల జీవితాన్ని ప్రతిబింబించారు.

**తెలంగాణ భాషపై కేసీఆర్ స్పృహ:** తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తెలంగాణ భాషను ప్రభుత్వ వేదికల మీద గౌరవంతో వినిపించేలా చేశారు. సిద్దిపేట సభలో ఆయన 'ఒక్కసారి' తెలంగాణ మాట మాట్లాడమంటే కాళ్ల కింద నేల పోయిందన్నట్టుగా తడుముకున్న రోజులున్నాయి. కానీ, ఇకపై మన మాటే మన ప్రభుత్వం మాట.' అని చెప్పారు.

**తెలంగాణ భాషను పాఠ్యాంశాల్లోకి తీసుకురావడంలో చేసిన కృషి:** తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల పాఠ్యాంశాల్లో తెలంగాణ ప్రాచుర్యం పొందిన పదాలు, కథలు చేర్చబడినాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వర్గీకృత తెలంగాణ భాషా నిఘంటువులు వెలువడుతున్నాయి. ఉస్మానియా, కాకతీయ, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ భాషా, సాహిత్యంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి.

**భాషకు ఎప్పుడు గౌరవం లభిస్తుందంటే..:** తెలంగాణ భాషా గౌరవం అనేది పుస్తకాల్లో రాసే విషయమే కాదు. ప్రతి తల్లి తన పిల్లలతో మాట్లాడే భాషలో, ప్రతి ఉపాధ్యాయుడు బోధించే వాక్యంలో, ప్రతి ఉద్యోగి తన కార్యాలయంలో వాడే పదాల్లో భాషా గౌరవం ఉండాలి.

కె.కృష్ణమూర్తి
97051 96097

**తెలంగాణ భాషకు నిజమైన గౌరవం లభించాలంటే..:** ప్రభుత్వ విధి విధానాల్లో పదాలు మార్చాలి. విద్యారంగంలో తెలంగాణ పదాలు చేర్చాలి. ప్రతీ పత్రిక, ఛానల్ తెలంగాణ పలుకుబడిని గౌరవించాలి. భవిష్యత్తు తరాలకు ఈ భాష గర్వంగా నేర్పాలి. తెలంగాణ భాష గౌరవాన్ని పొందినప్పుడే నిజమైన తెలంగాణ స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పగలం.

## యూటర్న్

బాల్యంలోకి వెళ్లిరావాలనుంది
కాని ఇప్పుడక్కడ
అమ్మ ఉండదు.

చిన్నప్పటి ఇంటిలో
నిద్రపోవాలని కోరిక
కాని అప్పటి స్వప్నాలు
తూనీగల్లా ఎగరవు.

నాటి స్కూల్ మైదానంలో
ఫుట్‌బాల్ ఆడాలని వుంది
ఇప్పుడా గ్రౌండే లేదు.
నేను తన్నిన బంతి
కాలాన్ని చీల్చుకుంటూ ఎటుమాయమైందో!

అప్పటి స్నేహితుల్ని
ఒక్కచోట కలవాలని వుంది
కాని తెగిన ముత్యాలహారం కోసం
ఎన్ని దేశాలు వెతకాలో!

జారుడుబండ ఎక్కి
గతంలోకి జారిపోవాలని వుంది
ఇవాళ హృదయం
రెండు ముక్కలుగా కొట్టుకుంటుంది.

నా అవస్థ చూసి
పక్కనే వున్న మా మనుమడు నవ్వుతున్నాడు
తాతా!
జీవితంలో యూటర్న్ ఉండదు
నువ్వే చెప్పావు అన్నాడు.

డాక్టర్ ఎన్.గోపి

## ఫలితాలు విడుదల

'పాలపిట్ట మాసపత్రిక– వాసా ఫౌండేషన్' సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కరిపె రాజ్‌కుమార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, ములుగు లక్ష్మీ మైథిలి గెలుచుకున్నారు. దాదాపు 150 మంది కవులు పాల్గొన్న ఈ పోటీలో 8 మంది కవులకు ప్రత్యేక బహుమతులు రాగా, మరో 9 మంది కవులు రాసిన కవితలు సాధారణ ప్రచురణకు ఎంపికయ్యాయి. రూప్‌కుమార్ డబ్బీకార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

> రాపోలు సీతారామరాజు రచించిన 'నెల్సన్ మండేలా' గ్రంథం తెలుగు సాహిత్యంలో అరుదైన జీవిత చరిత్రగా నిలుస్తుంది. రచయిత మండేలా జీవితాన్ని కథనం చేయడమే కాకుండా, ఆయన వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, మానవీయత, తత్త్వబోధనలను ఎంతో లోతుగా విశ్లేషించారు. విశ్లేషణాత్మక దృక్పథం, తాత్త్విక ఆవిష్కరణ, స్ఫూర్తిదాయక సందర్భాల ఎంపిక రచయిత రాపోలును ఒక నిబద్ధత కలిగిన సాహిత్య దిట్టగా నిలబెడతాయని చెప్పవచ్చు.

# జీవితం అందించిన సందేశం

సీతారామరాజు అధ్యయనా చాతుర్యం, పరిశోధనాత్మక నైపుణ్యానికి ప్రతీక ఈ అనువాదం. మండేలా స్వగ్రామం నుంచి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసేదాకా జీవనయానాన్ని పాఠకుడి మనసులో పరవశంగా ప్రవహించేలా తీర్చిదిద్దారు. ప్రధాన ఘట్టాలైన అణచివేత, జైలు జీవితం, సంఘర్షణలు, మానవీయత, ప్రజాస్వామిక విలువలపై దృష్టిసారించి, చరిత్రను నిస్పృహగా కాక, జీవంతో నింపుతూ వర్ణించారు. అంతేకాదు, నాయకత్వ మౌలిక లక్షణాలపై దృష్టిసారించే ఒక మానవతా సాహిత్య గ్రంథమిది. ఈ పుస్తకంలో రచయిత తన అంతర్‌దృష్టిని మేళవించారు.




మండేలా నాయకత్వం శూన్యంలోంచి రూపుదిద్దుకున్నది కాదు. అది అనుభవాల అల్లిక, ఆత్మస్ఫూర్తితో పెరిగిన దారి. ప్రజాభిప్రాయాలను గౌరవించే శక్తి, వినయంతో కూడిన దృఢత, ప్రశాంతత ఇవన్నీ అతని నాయకత్వ లక్షణాలుగా తీర్చిదిద్దాయని రచయిత వివరించారు. ముందుండి నడిపించే నాయకుడే కాదు, వెనుక నుంచి మార్గం చూపే మహోన్నతుడిగా మండేలాను అభివర్ణించారు. మండేలా వ్యక్తిత్వంలో క్షమాగుణం ప్రస్ఫుటంగా కనపడుతుంది. వేధించిన వారిని జైలు జీవితం తర్వాత కూడా క్షమించడం ఆయన లోపలి శాంతిని, లోతైన తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. మండేలాలోని ఈ భావాన్ని రచయిత రాపోలు హృదయానికి హత్తుకునే భాషలో పాఠకుల ముందుంచారు.

మంజుల కులకర్ణి

మండేలా రాజకీయ తత్వం, సమాజంలో సమానత్వం సాధించే ప్రయత్నంగా రచయిత విశ్లేషించారు. గాంధేయ తత్వానికి తన జీవితాన్ని అంకితం చేసినా, పరిస్థితుల చట్రం మారగానే మార్పు వైపు అడుగేసిన మండేలా నిర్ణయాన్ని రచయిత నిగూఢంగా అందించారు. ఆయుధ పోరాటం వైపు మొగ్గు చూపిన సమయంలోనూ ఆయన లక్ష్యం ప్రజల విముక్తి అని స్పష్టంగా తెలియజేస్తారు. మండేలా వ్యక్తిత్వం శ్రమ, త్యాగం, చింతనతో ముడిపడింది. మండేలా జీవితాన్ని వెలికితీసే విధానం, పాఠకునిలో విభిన్న ఆలోచనలు రేకెత్తిస్తుంది. శత్రువులను సైతం మిత్రులుగా మలచిన సామర్థ్యం, అతని ఆత్మగౌరవానికి నిదర్శనం. జైలు అనుభవాన్ని తపస్సుగా మార్చుకున్న మహోన్నత వ్యక్తిగా మండేలా ఈ రచనలో ఆవిష్కృతమవుతారు.

రాపోలు సీతారామరాజు శైలి సరళంగా ప్రస్ఫుటమైన భావనలతో నిండి ఉన్నది. ఆయన ఎంచుకున్న పదాలు, వాక్య నిర్మాణం, భావ ప్రకటన ఇవన్నీ గ్రంథానికి మరింత బలాన్నిచ్చాయి. ముఖ్యంగా మండేలా మాటలను విశ్లేషిస్తూ వాటికి జీవం పోశారు. ఈ పుస్తకం ఒక మహనీయుడి జీవితం అందించిన విలువల సందేశం. నాయకత్వానికి మార్గదర్శి, మానవతా దృక్కోణానికి దర్పణం, ప్రజాస్వామ్య భావనకు బలమైన వేదిక. రాపోలు రచన, తెలుగులో జీవిత చరిత్ర రచనలకు ఓ కొత్త ఊపిరిగా నిలుస్తుంది. యువత ఈ గ్రంథాన్ని చదివి, స్ఫూర్తి పొందాలి.